
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

5

ఆదివారం 14 సెప్టెంబరు 2025



ఆటో పేమెంట్

బండి నడిస్తే బువ్వ.. లేదంటే పస్తులే.. అలాంటి దుర్భర బతుకులు డ్రైవర్లవి. సూపర్‌సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం తెచ్చిన 'స్త్రీ శక్తి' పథకం వారి జీవితాలను మరింత ఇక్కట్ల పాలు చేసింది. రెక్కాడితే గాని డొక్కాడని వారికి ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెట్టింది. దీన్ని గుర్తించింది రాష్ట్ర ప్రభుత్వం. డ్రైవరన్నలను ఆదుకునేందుకు సిద్ధమైంది. ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల కష్టాలను కూసింతైనా తీర్చాలనుకున్నది. అనుకున్నదే తడువుగా శుభవార్తను అందించింది. 'వాహన మిత్ర' కింద రూ.15వేలు అందించేలా చర్యలు చేపట్టింది. ఇందుకు అనంతపురంలో జరిగి సూపర్ 'సిక్స్-సూపర్ హిట్' వేదికైంది. అక్కడే సీఎం చంద్రబాబు రూ.15,000 అందిస్తామని ప్రకటించారు. దీంతో వాహనమిత్రుల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. వారి కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

నంద్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సూపర్-6 కింద ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కూటమి ప్రభుత్వం కల్పించింది. దీంతో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు నష్టపోతారని ప్రభుత్వం పునఃఆలోచన చేసి ఆయా వర్గాలను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. ఆయా వర్గాలను ఆదుకోవడానికి 'వాహన మిత్ర' కింద ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందజేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు సైతం ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన సూపర్-6..సూపర్ హిట్ సభలో ప్రకటించారు. అదీ కూడా అతి త్వరలోనే ఆటోడ్రైవర్లు, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు దసరా పండుగ కానుకగా ఆర్థికసాయం అందిస్తామని, దీంతో ఆయా వర్గాల్లో ఆనందోత్సవం మొదలైంది. ఇదే క్రమంలో సంబంధిత శాఖల అధికారులు సైతం ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు.

- ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు దసరా కానుక
- ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఆర్థిక సాయం
- జిల్లాలో 18 వేల మందికి లబ్ధి
- డ్రైవర్ల ఇంట ఆనందోత్సవం

ఆదుకునేందుకు..

'స్త్రీ శక్తి' అమలుతో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భవిష్యత్‌లో అనేక రకాలు ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు 'వాహన మిత్ర' పేరుతో ఆయా వర్గాలకు ఏటా ఒక్కొక్క రికి రూ.15వేలు ఆర్థికసాయం అందిం చేలా చర్యలు తీసుకుంది. ఇది లా ఉండగా స్త్రీ శక్తి అమలుకు ముం దు.. ఆయా వర్గాల్లో రోజుకు రూ.1000నుంచి రూ.2వేలు వరకు సంపాం దించేవారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో సదరు వర్గాల ఆదాయం తగ్గింది. ఈనేపథ్యంలో ఆయా వాహనాల కొనుగోలు.. రుణ వాయిదాలు, ఇంధన ఖర్చు తదితర వాటితో సతమత మవుతున్నారు. ఈ క్రమంలో ఈమూడు వర్గాలను ఆదుకోవడం కోసమే వాహన మిత్ర సాయాన్ని పెంచి అందించేలా చర్యలు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో రూ.10వేలు మాత్రమే..

వైసీపీ హయాంలో ఆటో డ్రైవర్లకు రూ. 10 వేలు మాత్రమే చెల్లించారు. అదీ కూడా ఆశించిన స్థాయిలో అందించలేదనే విమర్శలున్నాయి. కొందరిపై కక్ష సాధింపు నేపథ్యంలో కూడా ఇవ్వ లేదని ఆ వర్గాల నుంచి తెలిసింది. కూటమి ప్రభుత్వం 'వాహన మిత్ర'ను ఏకంగా రూ.15వేలకు పెంచి అమలు చేయడంతో ఆ వర్గాలు హర్షం వ్యకం చేస్తున్నాయి.

వీరందరూ అర్హులే..

వాహన మిత్ర కింద ఆటో, మోటర్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు అర్హులు. ప్రధానంగా ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన ఆర్‌సీ, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలి. ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ. 22వ తేదీన తుదిజాబితా ప్రకటిస్తారు.

అధికారిక లెక్కల ప్రకారం

'వాహన మిత్ర' కింద జిల్లాలో సుమారు 18వేల మందికి ఆర్థిక సాయం అందనుంది. అధికార లెక్కల ప్రకారం జిల్లాలో ఆటో డ్రైవర్లు.. 16,531 మంది, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు మరో 2వేల మంది ఉండవచ్చని అధికారుల అంచనా. ఈ లెక్కన జిల్లాలో ఈ ఏడాది వాహన మిత్ర కింద ప్రభుత్వం రూ.27కోట్లకు పైగానే అందించనుంది. మొత్తంగా ఈ మూడు వర్గాల డ్రైవర్ల ఇంట వాహన మిత్ర తో ఆనందోత్సవం మొదలైంది.

ఆనందంగా ఉంది..



ప్రభుత్వం డ్రైవర్ల కష్టాలను దృష్టిలో ఉంచుకొని దసరాకు 'వాహనమిత్ర' కింద రూ.15,000 జమ చేయడం ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. ఈ నగదు ఆటో మరమ్మతులతో పలు రకాలుగా ఉపయోగపడుతుంది. ఆర్థిక సాయం చేయడం చాలా ఆనందంగా ఉంది.

● లక్ష్మీనారాయణ, ఆటో డ్రైవర్, నంద్యాల

కూటమి ప్రభుత్వ పాలన చాలా మేలు



వైసీపీ హయాంలో ఆటో కార్మికులకు రూ.10,000 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రూ.15,000 అందిస్తోంది. ఈ నగదు మాకు చాలా ఉపయోగపడుతుంది. వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం పాలనే చాలా మేలు.

● షాలిషా, ఆటో డ్రైవర్, నంద్యాల

బండి మరమ్మతులకు వస్తాయ్..



ఆటో చిన్నచిన్న మరమ్మతులకు వాహనమిత్ర పథకం ఎంతో ఉపయోగపడుతుంది. కొందరు ఆటోడ్రైవర్లకు ఎఫ్‌సీకి కూడా వినియోగించుకుంటారు. చక్కటి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది.

● రాము, ఆటో డ్రైవర్, నంద్యాల

డ్రైవర్లకు ఆర్థికంగా కలిసి వస్తుంది



ప్రభుత్వం వాహనమిత్ర కింద ఆర్థిక సాయం చేయడం డ్రైవర్లకు ఆర్థికంగా ఎంతో కలిసి వచ్చే అంశం. ఒక్కొక్కరికి రూ.15వేలు అందించడం శుభపరిణామం. పథకం అమలు అంశాలపై ఆరా తీస్తున్నాం. అర్హులైన వారందరూ వాహనమిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

● శివారెడ్డి. జిల్లా రవాణాశాఖ అధికారి, నంద్యాల



లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది
- జాతీయ లోక్ అదాలత్‌లో ఒకేరోజు 8,122 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే సత్వర న్యాయ సహాయాన్ని పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తెలియజేశారు. నగరంలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 60 మంది రైతులకు రూ.83,96,374 నష్టపరిహారాన్ని ఈ సందర్భంగా అందజేస్తున్నామని, కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించామని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 8,122 కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కమలాదేవి, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి వాసు, సీబీఐ కోర్టు జిల్లా న్యాయాధికారి శోభారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సరోజనమ్మ, జూనియర్ సివిల్ న్యాయాధికారి కిరణ్ కుమార్, కోర్టు మానిటరింగ్ సీఐ రామానాయుడు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఎస్పీగా సునీల్ షెరాన్

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీగా సునీల్ షెరాన్‌ను నియమిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్ షెరాన్ 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. మొదట ట్రైనింగ్ సమయం అనకాపల్లిలో చేశారు. ఆ తర్వాత పార్వతీపురం ఏఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని గ్రే హౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా పనిచేస్తూ నంద్యాల ఎస్పీగా నియమితులయ్యారు. ఆయన స్వస్థలం హర్యానా(ఢిల్లీ). సునీల్ షెరాన్ ఆదివారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం ఆయా పనుల్లో నిమగ్నమయింది. ప్రస్తుత ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గత ఏడాది జూలై 15వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం బదిలీ కావడంతో ఆశాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.

జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



7లో

పొంగిపొర్లిన వాగులు

- భారీ వర్షాలతో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



ఆత్మకూరులోని కేజీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మహానంది: నల్లమలలో పొంగి ప్రవహిస్తున్న పాలేరు వాగు

ఆత్మకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా ఆత్మకూరు ప్రాంతంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తు న్నాయి. గురువారం 94.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా శుక్రవారం 27.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. శని వారం సాయంత్రం కూడా భారీ వర్షం కురి సింది. దీంతో పట్టణంలో పలు లోతట్టు కాల నీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో జనం తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. పట్టణం లోని కేజీరోడ్డు, కప్పలకుంట, అప్పారావువీధి తది తర ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవ డంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. కాగా భారీ వర్షాల వల్ల మినుము, మొక్క జొన్న తదితర పంట పొలాల్లో భారీ నీరు నిలిచిపోవడంతో రైతులు ఆవేదన చెందు తున్నారు. ఇదిలావుంటే వర్షాల కారణంగా ఆత్మకూరు పట్టణ శివారులోని భవనాశి నది, పడేవాగులో ఉధృతంగా ప్రవహిం చాయి. అదేవిధంగా సిద్ధాపురం చెరువులో కూడా నీటినిల్వలు పెరగడంతో చెరువ నీరు కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై ప్రవహిం చింది. దీంతో అక్కడ అప్రమత్తమైన చర్యలు చేపట్టారు.



సిద్ధాపురం చెరువు వద్ద కేజీ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

మహానంది: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో ఎగువన ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలోని పాలేరు వాగు పొంగి ప్రవహించింది. దీంతో అటువైపుగా మహానందికి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దైవద ర్శనం కోసం మహానందికి వచ్చిన భక్తులకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఇబ్బందులు పడ్డారు. మండ లంలో రైతులు అధికంగా సాగు చేసే అరటి తోటల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం వల్ల తమ పంటలకు ఎలాంటి నష్టం లేదని రైతులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని డ్రైనేజీల నుంచి నీరు పారి రహదా రులు బురద మయమయ్యాయి. రాత్రి వరకు ఎడ తెరిపి లేకుండా వర్షం కురి సింది.

శ్రీశైలం జలాశయానికి పెరిగిన వరద



ఏడు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

- 7 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. ఈక్రమంలో శనివారం జలాశయం 7 రేడి యల్ క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 10అడుగుల ఎత్తు తెరిచి సాగర్‌కు స్పిల్‌వే గుండా 1,93,634 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువన జూరాల స్పిల్ వే, అలాగే విద్యుదుత్పత్తి అనంతరం, సుంకేసుల డ్యాం నుంచి మొత్తం కలిపి 2,24,166 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్ కో అధికారులు 66,280 క్యూసెక్యుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం శనివారం సాయంత్రం 6గంటల సమయానికి 884 అడుగులుగా ఉండగా, నీటినిల్వ సామర్థ్యం 210 టీఎంసీలుగా నమోదు అయింది. శ్రీశైలం డ్యాం ఇంజనీర్లు గరిష్ఠ స్థాయి నీటినిల్వలు ఉంచుతూ వరద నీటిని సాగనంపుతున్నారు. డ్యాం గేట్లను తెర వడంతో సందర్శకులు తాకిడి పెరిగింది.

ఉపాధి కూలీలకు ఊరట

- వేతన బకాయిలు మంజూరు
- రూ.100 కోట్లు కూలీల ఖాతాల్లో జమ
- పెండింగ్ వేతనాలు రూ.30కోట్లు

నంద్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి కూలీలకు ఐదు నెలలుగా వేతన బకాయిలు పేరుకుపోయాయి. కూలీల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈనేపథ్యంలో ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,669 కోట్లు విడుదల చేయగా ఇందులో జిల్లాకు రూ.100కోట్ల వరకు కూలీల వేతనాలు మంజూరయ్యాయి. దీంతో ఆయా కూలీలకు అతి త్వరలోనే తమ ఖాతాలకు సదరు వేతనం జమకానుంది. దీంతో ఒక్కసారిగా ఉపాధి కూలీలకు ఊరట కలిగినట్లైంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

● ఉపాధి హామీ పథకం కింద జారీ చేసిన కార్డులు	: 2.67 లక్షలు
● పనికి వస్తున్న జాబ్ కార్డులు (కుటుంబాలు వారీగా)	: 2.15లక్షలు

జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల్లో..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల్లో 49.70 లక్షల పని దినాలు ఉపాధి కూలీలకు కల్పించారు. ఇందులో 100 రోజులు పూర్తిచేసిన కుటుంబాలు 820 ఉన్నాయి. ఈ ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీల పరంగా రూ. 130 కోట్ల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. తాజాగా విడుదల చేసిన ప్రకారం.. రూ. 100 కోట్లు బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన రూ.30 కోట్ల పెండింగ్ బిల్లులు త్వరలో వచ్చే అవకాశం ఉందని సమాచారం.

నేరుగా కూలీల ఖాతాలకు..



ఉపాధి కూలీల వేతనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసింది. నేరుగా ఉపాధి కూలీల ఖాతాలకు జమ అవుతోంది. ఇప్పటికే ఖాతాలకు జమ ప్రక్రియ ప్రారంభమైంది. పెండింగ్ వేతనాలు కూడా త్వరలోనే పడుతాయి.

-సూర్యనారాయణ, పీడీ, డ్వామా

వేతనాలు చెల్లింపు జాప్యంతో..

ఉపాధి కూలీలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కూలీల వేతనాలు చెల్లింపు జాప్యంతో కూలీలకు ఇబ్బందికరంగా మారింది. కేంద్రం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో ఐదు నెలలకు పైగా లక్షల మందికి రూ.కోట్లలో వేతనాలు బకాయిలు పడినట్లైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సాధారణ పనులతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత కింద గ్రామాల్లో పంట కుంటలు, పశువుల నీటి తొట్టెలు, చెరువులు అభివృద్ధి, వివిధ పూడికతీత పనులు చేశారు. ఈ నేపథ్యంలో ఎక్కువగా కూలీల వేతనాలు పెండింగ్‌లో పడినట్లైంది. ఇటీవల వేతనాలు మంజూరు చేయడంతో వారిలో ఆనందోత్సవం మొదలైంది. తిరిగి పనులపై ఆసక్తి చూపుతుండటం గమనార్హం.



తుంగభద్ర తీరం

సాహిత్యం

నవరసాల సమాహారమే పుంజుతోక



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పక్షి జాతిలో కోడిపుంజుకు ఒక ప్రత్యేకత ఉంది. అది వేకువ జామునే నిద్రలేపడానికి నాటి పెద్దలకు కూతల గడియారంలా పనిచేసేది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కోడికూత తోనే రైతుల లోగిళ్లు తెల్లవారుతాయి. పల్లెల్లో పెరిగే పుంజుకోడి దర్పమే వేరు. రాజసంలా ఠీవిగా నిలబడి, రెక్కలను ఆర్చి.. గొంతు సవరించుకొని అది వేసే 'కొక్కొరో...కో..!' కూత వీనుల విందు చేస్తుంది. సమస్త వర్ణాలు కోడిపుంజు ఈకల్లో మిరమిట్లు గొలిపినట్లే.. నవరసాలతో కూడిన కవితా సుమాలు ఇందులో కలిసి దర్శనం ఇవ్వడం వల్ల కవి పుస్తకానికి ఈ వైవిధ్యమైన పేరు ఎంచుకున్నారు. 'పుంజుతోక' నామకరణ చేయడం రచయితలోని కొత్త ఆలోచనా విధానాన్ని వ్యక్తం చేస్తుంది. పుస్తక ముఖచిత్రం, శీర్షిక కొంత చిత్రంగా, హాస్యంగా, ఆకట్టుకునే విధంగా నిలుస్తుంది. సామాజిక స్పృహ, ప్రకృతిపై ప్రేమ వీరి ప్రధాన వస్తువులు. కళాశాల రోజుల నుంచి పోలీసు శాఖలో వివిధ హోదాలు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందేదాకా, దాదాపు ముప్పయ్ సంవత్సరాల మధ్యకాలంలో రచించిన వివిధ రకాల అనుభూతులను ఏర్చి, కూర్చి ఇప్పుడు మనకు అందించారు ఈ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) కొత్తకోట శ్రీనివాసరెడ్డి. సి.బెళగల్ మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన రచయిత శ్రీనివాసరెడ్డి ఐపీఎస్ అధికారిగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ విజిలెన్స్ శాఖ డీజీపీగా ఇటీవల పదవీ విరమణ చేశారు. ఆయన రాసిన పుంజుతోక కవితా సంపుటిని ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ సాహితీవేత్తలు ఆవిష్కరించనున్నారు. ఈ సంపుటిలో ఎన్నో హాస్య, వ్యంగ కవితలు అక్కడక్కడ తళుక్కుమని మెరిసి నవ్విస్తాయి. చురుక్కుమనిపిస్తాయి. కవి నిజాయితీ, స్వచ్ఛత కవితల నిండా కనిపిస్తుంది. దీర్ఘ సమాసాలు, అర్థంకాని పదబంధాలు, సంస్కృత భూయిష్టమైన వాక్య నిర్మాణాలు లేకుండా చాలా సరళంగా, మనస్సుకు హత్తుకునేలా, సూటిగా వ్యవహారిక భాషలో రాసిన వచన కవితల సంపుటిని ముందుకు తీసుకురావడంలో రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి కృషి శ్రమ చాలా కనిపిస్తుంది. వృత్తిరీత్యా నిత్యం ఎన్నో సవాళ్లతో, నిరంతర ఒత్తిడి మధ్య కూడా వాటిని జయించి ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు.



● డాక్టర్ ఎం.హరికిషన్, కథా రచయిత, కర్నూలు

మతోన్మాద శక్తులను ఓడించండి: గపూర్



మాట్లాడుతున్న గపూర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతతో మతోన్మాద శక్తులను ఓడించాలని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ గపూర్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఎస్ ఫంక్షన్‌హాలులో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా 'వర్తమాన రాజకీయాలు- సీపీఎం వైఖరి' అనే అంశంపై పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గపూర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపై వచ్చేలా కృషి చేసిన మొదటి వ్యక్తి అని కొనియాడారు. సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు జి.రామక్రిష్ణ, అలివేలమ్మ, ఎం.విజయ్‌నరసింహులు, నగేష్ పాల్గొన్నారు.

అవిశ్రాంత యోధుడు





వైద్యం వెంకటేశ్వరా చార్యులు

వైద్యం సహకారంతో టీటీడీ ముద్రించిన శ్రీ మహాభాగవతములు 8 భాగాల పుస్తకాలు


- 160కి పైగా పుస్తకాలు రచించిన తెలుగు సాహితీవేత్త
- అముద్రితాలుగా మరో 64 గొప్ప రచనలు
- జిల్లా చరిత్ర, పురావస్తు విజ్ఞానంపై పరిశోధనలు
- 56 ఏళ్లుగా సుదీర్ఘ సాహితీ ప్రస్థానంలో వైద్యం వెంకటేశ్వరాచార్యులు

తెలుగు భాషకు మూడు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న విషయం ఎవరికైనా తెలుసా..? దాన్ని మొట్టమొదటిసారిగా బయట పెట్టింది ఆయనే. అప్పటి వరకు దక్షిణాదిలో తమిళమే అత్యంత ప్రాచీన భాషగా భుజాలు చరుచుకునే ఆ ప్రాంత భాషావేత్తల మధ్యే, మద్రాసు యూనివర్సిటీలో 'తెలుగే అత్యంత ప్రాచీన భాష'గా రుజువులు చూపించి ఒప్పించారు. జిల్లాలో ఆదిమానవుడు నడయాడిన కేతవరం గుహల గురించి.. బేతంచెర్ల పరిసర ప్రాంతాల్లోని గుహల గురించి.. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అనేక చారిత్రక కట్టడాల గురించి, నదీతీర ప్రాంతాల్లోని నాగరికత గురించి అక్షర రూపంలో వెలుగులోకి తీసుకువచ్చింది కూడా ఆయనే. అమరావతిలో లభించిన తొలి తెలుగు శాసనంలోని తెలుగు పదంగా పేర్కొనే 'నాగబు' కన్నా.. కర్నూలు జిల్లాలో లభించిన 14 శాసనాల్లోని 'అందిర' అనే పురాతన తెలుగు పదం ఉందని చాటి చెప్పిన చరిత్ర పరిశోధకుడు ఆయన. టీటీడీ చేపట్టిన అనేక మహా మహా పురావస్తు గ్రంథాలు, ఏళ్ల నాటి తాళపత్ర గ్రంథాలను పునఃరచనల ద్వారా నేటి తరానికి అందించిన సాహిత్య ఘనశాలి ఆయన. కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, భాషావేత్తగా బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ఆయనే వైద్యం వెంకటేశ్వరాచార్యులు. 76 ఏళ్ల ప్రాయంలోనూ ఆయన సాగిస్తున్న సాహిత్య జైత్ర యాత్రలో వందలాది పురస్కారాలు, సత్కారాది బిరుదులు ఆయన కీర్తి కిరీటంలో కలికితురాయిలా నిలిచిపోయాయి.

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలోని రేమట గ్రామానికి చెందిన చెందిన కృష్ణమ్మ, వైద్యం పురుషోత్తమాచార్యులకు ఏకైక సంతానం వైద్యం వెంకటేశ్వరాచార్యులు. ఉపాధ్యాయుడైన తండ్రి వద్దే ప్రాథమిక విద్య అభ్యసించారు. 1971లో డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1972లో సిల్వర్ జూబ్లీ కళాశాల్లో స్టోర్ కీపర్‌గా ఉద్యోగం లభించింది. అదే ఏడాది గద్వాలకు చెందిన పుష్పావతమ్మతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు వైద్యం రాజగోపాల్. అనంతరం దూర విద్యా విధానంలో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ పూర్తి చేశారు. 1999 వరకు సిల్వర్ జూబ్లీ కళాశాల్లో, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఉద్యోగం చేసి, తర్వాత జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై 2006 వరకు బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పనిచేసి, అక్కడే పదవీ విరమణ చేశారు. 2003లో ఆటవెలదిలో 'తెలుగు భాష' అనే గ్రంథాన్ని తీసుకువచ్చారు. 2004లో 'వ్యాస జయంతి'లో జిల్లాకు సంబంధించిన సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక అంశాలను పరిశోధనాత్మకంగా ముద్రించారు. 2005లో ఉన్నమాట పేరుతో 136 ఆటవెలది సూక్తులతో శతకం రాశారు. 2011లో 'కర్నూలు జిల్లా కవి తరంగిణి' పేరుతో జిల్లా కవుల చరిత్రను పరిశోధనాత్మకంగా రాశారు. ఇది ఎంతో ప్రామాణిక గ్రంథంగా జిల్లా వాసులకు సమాచారం అందిస్తుంది. వెయ్యేళ్లలో జిల్లాలోని కవులు, రచయితలను పరిచయం చేసిన అద్భుత గ్రంథంగా ఇది నిలుస్తుంది. కర్నూలులోని సుమారు 50 మండలాల్లోని గ్రామాలను, మహబూబ్‌నగర్‌లోని అనేక ప్రాంతాలను పర్యటించారు. జిల్లాలో లభించిన 14 శాసనాలను పరిశోధించి, అందులోని 'అందిర' అనే పదం ద్వారానే ఆంధ్రపదం పుట్టిందని, అదే తొలి తెలుగు పదంగా తన పరిశోధనల ద్వారా వెల్లడించారు. క్రీ.పూ. 3వేల ఏళ్లకు ముందే జిల్లాలోని అనేక గుహల్లో ఆదిమానవుల రాతలు, చిత్రాలు ఉన్నాయని పరిశోధనలతో నిరూపించారు. 1972లో అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్, సిల్వర్‌జూబ్లీ అధ్యాపకుడు నాగభూషణంలతో కలిసి కేతవరం, బనగానపల్లె పరిసర ప్రాంతాల్లోని గుహలను వెలుగులోకి తీసుకువచ్చారు.

మూడు గ్రంథాలయాలు.. వేలాది పుస్తకాల సేకరణ

తెలుగు సాహిత్యంతో పాటూ వివిధ భాషలకు సంబంధించిన వేలాది పుస్తకాలను వైద్యం వెంకటేశ్వరాచార్యులు సేకరించారు. వందలాది అరుదైన తాళపత్ర, తామ్రపత్ర గంథాలను భద్రపరిచారు. కర్నూలు, బెంగళూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని తన గృహాల్లో వాటిని భద్రపరిచారు. సుమారు మూడు వేలకు పైగా పుస్తకాలను కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బహూకరించారు. అలాగే మారుతి మెగా సిటీలోని దస్తగిరిరావు అనే సాహితీవేత్త నిర్వహించే గ్రంథాలయానికి 1,500 పుస్తకాలు అందజేశారు. హైదరాబాదు పురావస్తు గ్రంథాలయం వారు కొన్ని తాళపత్ర గ్రంథాలను తీసుకువెళ్లారు. ఒకప్పుడు సైకిల్‌పై గ్రామ గ్రామాన తిరుగుతూ, వారి వద్ద ఉన్న అరుదైన పుస్తకాలు ఆనాడు వందలాది రూపాయలు వెచ్చించి కొనడం, లేదా ఫొటోస్టాట్ కాపీలు తీయించి భద్రపరచడం చేశారు వైద్యం వెంకటేశ్వరాచార్యులు.



వ్యాస వైజయంతిక (మొదటి భాగం)

● టీటీడీ ద్వారా అనేక గ్రంథాలకు వెలుగుబాట...

సంస్కృతాంధ్ర భాషల్లో అనేక పౌరాణిక, చారిత్రక, ఇతిహాస గ్రంథాలను వెలుగు బాట పట్టించిన ఖ్యాతి వైద్యం వేంకటేశ్వరాచార్యులకు దక్కుతుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వారూ గర్వించదగ్గ అంశంగా చరిత్రలో నిలిచిపోతుంది. అలాగే ఎన్నో తాళపత్ర గ్రంథాలను, శాసనాలను కూడా అయన పుస్తక రూపంలో తీసుకువచ్చారు. వేనేళ్ల సాహిత్య చరిత్రకు సంబంధించిన అనేక అంశాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి, అక్షర రూపంలో నిక్షిప్తం చేశారు. సుమారు పదేళ్లకు పైగా తిరుపతిలోని టీటీడీ ముద్రణల విభాగంలో పనిచేస్తూ రామాయణ, భాగవతాది గ్రంథాలను పద్య అర్థ రూపంలో తెలుగువారికి అందించారు. కర్నూలు జిల్లాకు చెందిన సుమారు 800 మంది కవులు, పండితులు, రచయితలను పరిచయం చేస్తూ గొప్ప పరిశోధన గ్రంథం తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది.



వైద్యం రాసిన పుస్తకం 'కర్నూలు జిల్లా కవి తరంగిణి'



'తొలి తెలుగు ఆధ్యాత్మ రామాయణము' పుస్తకం

ఎన్నో పరిశోధన పత్రాల సమర్పణ...

దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన సెమినార్లలో అనేక పరిశోధన పత్రాలు సమర్పించారు. 12 పరిష్కృత గ్రంథ రచనలు చేశారు. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 220 గ్రంథాలకు పీఠికలు, 500 గ్రంథాలకు ముందు మాటలు రాశారు. తెలుగు భాషలోని అన్ని దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికల్లో 300పైచిలుకు రచనలు ప్రచురితమయ్యాయి. ఆకాశవాణి కడప, హైదరాబాదు, కర్నూలు కేంద్రాల్లో సాహితీ చర్చల్లో పాల్గొన్నారు. కర్నూలు ఆకాశవాణిలో సూక్తిసుధ పేరుతో 6 ధారావాహికలు ప్రసారం అయ్యాయి.

ప్రస్తుతం తాను రాసిన 160కి పైగా గ్రంథాలతోపాటూ 64 వరకు గొప్ప గ్రంథాలు ముద్రించాల్సి ఉందని వైద్యం వెంకటేశ్వరాచార్యులు తెలిపారు. వీటిని మరింత సమగ్రంగా, లోతుగా మరోసారి అధ్యయనం చేశాక పుస్తకాల రూపంలోకి తీసుకువస్తానని ఆయన చెబుతున్నారు.

భవిష్యత్తులో రావాల్సిన రచనలు ఎన్నో..

అలాగే మొదట తెలుగు భాషలో చిత్ర కవిత్వం రాయాలని తలంచారని, అది కాకుండా 'ప్రపంచ భాషల్లో చిత్ర కవిత్వం' అనే మహాద్భుత భాషా రచనను ముద్రిస్తున్నానని తెలిపారు. అలాగే జిల్లాకు సంబంధించిన అనేక వెలుగు చూడని చారిత్ర అంశాలను కూడా భావి తరాలకు తెలియజేస్తూ పుస్తకాన్ని తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు.

కళ తనూజయం



- పుట్టుకతోనే మాటలు రావు.. చెవులు వినపడవు
- దివ్యాంగత్వాన్ని జయించి.. భరతనాట్యంలో రాణించి..!
- భళా అనిపించుకుంటున్న బోయ తనూజ

పుట్టుకతోనే ఆ అమ్మాయి మూగ, చెవిటి. అయినా నిరాశ చెందలేదు. జీవితంలో ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. ఓటమిని అంగీకరించకుండా గెలుపే లక్ష్యంగా సాగింది. తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించారు. భరతనాట్యంలో శిక్షణ ఇప్పించారు. మేటి నాట్యకారిణిగా తీర్చిదిద్దారు. ఆరో తరగతి చదువుతూనే నాట్యంలో అద్భుత ప్రతిభను కనబరుస్తోంది బోయ తనూజ. దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.

కోసిగి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన బోయ జిలేబి శ్రీధర్, మంజులవాణి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మొదటి ఇద్దరు కుమార్తెలు జనని, తనూజలు పుట్టకతోనే చెవిటి, మూగవారిగా జన్మించారు. మూడో కూతురు మాత్రం ఆరోగ్యంగా ఉంది. ఇద్దరు బిడ్డలు దివ్యాంగులుగా ఉన్నా ఆరోజుకు బాధపడ్డారు. అందరిలాగా వారిని కూడా తీర్చిదిద్దాలని అనుకున్నారు. అందుకు రెండో కూతురు తనూజను ఆదోనిలో దేశాయి భరతనాట్యం అకాడమీలో చేర్పించారు. ఆమె ఆదోనిలో ఆరో తరగతి చదువుతోంది. భరతనాట్యంలోనూ ప్రతిభ కనబరుస్తోంది.

ప్రదర్శనలతో ప్రశంసలు

తనూజ చిన్ననాటి నుంచే భరతనాట్యంపై ఆసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తల్లిదండ్రులు శ్రీధర్, మంజులవాణి దేశాయ్ నాట్యమండలిలో శిక్షణ ఇప్పించారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భరతనాట్యం ప్రదర్శనలిచ్చి పలువురిని ఆకట్టుకుంది. మలేషియాలో సైతం భరతనాట్యంలో ప్రతిభ కనబరిచింది. రెండో స్థానంలో నిలిచి మంచి పేరు తీసుకువచ్చింది. భరతనాట్యంలో రాణిస్తుండటంతో కోసిగి పేరును వేరే దేశంలోనూ గుర్తింపు తీసుకురావడం తనూజకే సాధ్యమైందని పలువురు కొనియాడుతున్నారు. పెద్దకూతురు బోయ జనని డ్రాయింగ్‌లో రాణిస్తుంది. భరతనాట్యంలో తనూజ మంచి ప్రదర్శన చేసి మరిన్ని అవార్డులు సాధించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



మలేసియాలో అవార్డు అందుకుంటున్న తనూజ



శ్రీశైలంలో ఉగాది మహోత్సవంలో భరతనాట్యం చేస్తున్న తనూజ



గురువు దేశాయితో

ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం

● జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేవీవీ ప్రజా చైతన్య కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తుందని ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్ అన్నారు. శనివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో గల జేవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) చేపట్టిన ఉపన్యాస జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శని, ఆదివారాల్లో ఈ జాతాలో మాట, పాట, ఆట, మ్యాజిక్ షోలపై శిక్షణ ఉంటుందన్నారు. చదువు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. దొంగ బాబాలను నమ్మవద్దని, వారు ఏ మహిమలు చూపినా నాలుగు సూత్రాల ద్వారానే చేస్తారన్నారు. హస్తలాఘవం, దాచి ఉంచిన భాగం, సైన్సు సూత్రాలు, సహాయకున్ని అందుబాటులో పెట్టుకొని వారి చేత ప్రజలను బురిడీ కొట్టిస్తారని తెలిపారు. గాలిలోంచి విభూది తీయడం, గాలిలో కూర్చోవడం, నిప్పును మింగడం, చేతిలో హారతి ఇవ్వడం వంటివన్నీ ఈ నాలుగు పద్ధతుల్లోనే అమలు చేస్తారని వివరించారు. సైన్సు సార్వత్రికమని, సత్యం త్రికాలాల్లో ఒకటిగా ఉంటుందన్నారు. జేవీవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏవీ రమణయ్య మాట్లాడుతూ నీళ్ల పెట్రోలుగా మారడం, బంగారు రెట్టింపు అవడం, మగపిల్లలను పుట్టిస్తామని చెప్పడం వంటి అంశాలతో దొంగబాబాలు, స్వామిజీలు, ఫకీర్లను దూరంగా పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి 10 జిల్లాల నుంచి 50 మంది కళాకారులు హాజరయ్యారు. జేవీవీ నాయకులు శేషాద్రినాయుడు, మహమ్మద్ మియా, బి. సురేష్, హరేరాం, ఖాజవలి, మాణిక్యం రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

అపూర్వ బంధం

● వారి మైత్రీకి 40 వసంతాలు ● కలుకుసున్న టీటీసీ తొలి బ్యాచ్ విద్యార్థులు



నలభై ఏళ్ల అనంతరం కలుసుకున్న టీటీసీ తొలిబ్యాచ్ పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు...ఏకంగా నలభై ఏళ్ల అనంతరం వారంతా కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. అలనాటి జ్ఞాపకాల జడివానలో తడిసి ముద్దయ్యారు. తరగతి గదుల్లో ఒకరినొకరు పిలుచుకున్న నిక్‌నేమ్‌లు, కళాశాల్లో చేసిన చిలిపి పనులు, గురువులతో తిన్న చీవాట్లు అన్నీ మళ్లీ ఒకసారి నెమరువేసుకొంటూ మురిసిపోయారు. ఆ కళాశాల్లో నలభై ఏళ్ల నాడు తాము కూర్చున్న తరగతి గదులు, కళాశాల ఆవరణలోని చెట్టు తనివితీరా వీక్షిస్తూ కన్నీటి చెలమలతో ఆనందబాష్పాలు రాల్చారు. కర్నూలులోని గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ఇందుకు వేదికైంది. 1984-85 నాటి ప్రభుత్వ టీచర్ ట్రైనింగ్ బ్యాచ్ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం ఈ పాఠశాల్లోనే టీటీసీ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులంతా ఉపాధ్యాయ ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలు సాధించి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని సంతోషంగా గడిపారు. భవిష్యత్తులో ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా టీటీసీ కేంద్రాన్ని కర్నూలులో ఇక్కడే ఏర్పాటుచేసిందని, తామంతా తొలిబ్యాచ్‌గా ఇక్కడ చదువుకున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు బోధించిన నాటి ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాల హెచ్ఎం పుష్పరాజ్, సీనియర్ ఉపాధ్యాయుడు షకూర్‌లకు తమ తరపున క్రీడా సామగ్రి బహూకరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు మాలతి, సావిత్రి, ఫౌజియా, ఉషారాణి, విశ్వమోహన్, యూనుస్, మౌలాలి పాల్గొన్నారు.

మహానందిలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్

మహానంది, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శనివారం రాత్రి ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఏపీ టూరిజం గెస్ట్ హౌస్ వద్ద టూరిజం డీవీఎం లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో చైర్మన్ అభిషేకార్చన పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి శాలువాతో సన్మానించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్, ఆర్ఎస్ శ్రీనివాసులు, ఏపీ టూరిజం అధికారులు ఉన్నారు.



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

మూగజీవాలకు గ్రాసమై..



ఉల్లి పంట రైతుకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు పంటను మూగజీవాలకు గ్రాసంగా వదిలేస్తున్నారు. శనివారం గోనెగండ్లకు చెందిన చాకలి బ్రహ్మయ్య అనే రైతు తాను సాగు చేసిన రెండున్నర ఎకరాల ఉల్లి పంటను మూగజీవాలకు గ్రాసంగా వదిలారు. రూ. 1.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. క్వింటం ఉల్లి ధర రూ. 500 నుంచి రూ. 600 పలకడంతో రైతు దిగాలు చెందాడు. ఇతడే కాక మండల కేంద్రానికి చెందిన మరో ఐదు మంది రైతులు సైతం దాదాపు పది ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పొలాల్లోనే మూగజీవాల కోసం గ్రాసంగా వదిలేశారు. కొందరు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. కొన్ని చోట్ల గ్రామస్థులు ఉచితంగా ఉల్లిని కోసుకొని వెళ్తున్నారు. ● గోనెగండ్ల, ఆంధ్రజ్యోతి



రైతు కష్టం నేలపాలు.. ఉల్లిగడ్డలను తీసుకువెళ్తున్న జనం



జీవాలకు ఆహారంగా.. ఉల్లి పంటను మేస్తున్న మూగజీవాలు

ఉల్లి అమ్మకాలు త్వరగా జరపండి

- వ్యాపారుల కొనుగోళ్లపై నిఘా పెట్టండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఏ.సిరి



ఉల్లిని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ఉల్లిగడ్డలను క్వింటానికి రూ.1,200 ప్రకారం కొనుగోలు చేసి అమ్మకాల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు ఈ విషయంలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తున్న ఉల్లిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం రాజు మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపడంతో పాటు స్థానికంగా హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్లు, విద్యాసంస్థలు, హాస్టళ్ల యజమానులకు విక్రయిస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిగా పక్వానికి వచ్చిన ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. జేడీ రామాంజనేయులు, డీడీ ఉపేంద్ర, ఏడీఎంలు సత్యనారాయణ చౌదరి, నారాయణమూర్తి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, చైర్‌పర్సన్ అజ్మిత్ బీ. వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

కుందూ నదిలో వృద్ధురాలి గల్లంతు



ఫకూర్ బీ (ఫైల్)

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ కుందూ నది వంతెన వద్ద ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పూల ఫకూర్ బీ గల్లంతైనట్లు తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం వంతెనపై నుంచి నదిలోకి దూకినట్లు స్థానికులు అంబటి రమణయ్య, గగ్గిర తిక్కయ్య తెలిపారన్నారు. ఆమె కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కుందూ వంతెన వద్ద తమ వీఆర్వోలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. కుందూలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున అటు వైపు ఎవరూ వెళ్లవద్దని ఆయన సూచించారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాఠశాలల్లో బోధనేతర పనులను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు గానూ.. ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రణభేరి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఐదు బృందాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందన్నారు. గత విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో లక్షన్నర మందికి పైగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం



చెక్కులను పంపిణీ చేస్తున్న న్యాయాధికారి సుధ

ఆదోని, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదోనిలో జాతీయ లోక్ అదాలత్ జరిగిన విచారణలో రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన బాధితా కుటుంబాలకు రూ.1.35 కోట్లు నష్టపరిహారం చెక్కులను రెండవ జిల్లా న్యాయాధికారి పేజీ సుధ పంపిణీ చేశారు. వివిధ బీమా సంస్థల ద్వారా బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా వారిలో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందన్నారు. లోక్‌అదాలత్ వంటి వేదికల ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో త్వరితగతిన న్యాయం పొందవచ్చని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనవసరంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృథా చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోర్టు బెంచ్ మెంబర్ లోకేష్‌కుమార్, బీమా కంపెనీల న్యాయవాది చకోలి గిరిధర్, ఇతర సీనియర్, జూనియర్ న్యాయవాదులు హాజరయ్యారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 79 మందుబాబులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వీరందరినీ శనివారం కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మొత్తం రూ.3.95 లక్షలు జరిమానా విధించిందని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

చెరువులో నీరున్నా.. ఉపయోగం లేదన్నా

- పూర్తిగా నిండిన జొన్నగిరి చెరువు
- ముళ్లకంపతో నిండిన 192 ఎకరాల భూమి
- అభివృద్ధి చేస్తే సాగుచేయొచ్చంటున్న రైతులు



ముళ్లకంపతో నిండిన 192 ఎకరాల ఆయకట్టు



పూర్తిగా నిండిన జొన్నగిరి చెరువు

తుగ్గలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండింది. అయినా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. దాదాపు 192 ఎకరాల ఆయకట్టు భూముల్లో కంపచెట్లు ఉండటంతో నిరుపయోగంగా మారింది. 20 ఏళ్ల క్రితం వరి పండించేవారమని, వర్షాలు కురువకపోవడం, ఇతర చెరువుల నుంచి నీరు చేరకపోవడంతో 368 మంది రైతులకు పొలాలు భూములు బీడుబారాయి. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో ముళ్ల కంప పెరిగింది. బీడ్లువారి కంపచెట్లు పెరిగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులు చేసి, ఆయకట్టును పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము శుభ్రం చేసుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తమ వల్ల కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కంపచెట్లు తొలగించి ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని అందించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు ఇవ్వాలి



ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఆయకట్టులో కంప తొలగిస్తాం. చెరువును అభివృద్ధి చేసి, గతంలో మాదిరిగానే పంటలు సాగుచేసే అవకాశం ఉంది. ● **గుంత రంగస్వామి, సాగునీటి సంఘం అధ్యక్షుడు, జొన్నగిరి**

కౌతాళంలో భారీ వర్షం

కౌతాళం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శనివారంకౌతాళంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు వర్షం దంచి కొట్టింది. దీంతో గ్రామంలో ఏ కాలనీ చూసినా చెరువులను తలపించేరీతిలో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైటిగేరి, కొండగేరి, శివప్పనగర్, అత్తార్ వీధి, వడ్డేగేరిలో నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు నీటిని బయటకు తోడేందుకు గంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది.



రెండో వార్డులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



వడ్డేగేరిలో మోకాల్లోతు నీరు

యువకుడి ప్రాణం తీసిన ఇస్త్రీ పెట్టె

వెలుగోడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతుకూరు గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఓబులేసు (25) ఇంట్లో తన దుస్తులను ఇస్త్రీ చేసుకునేందుకు ఇస్త్రీ పెట్టెను ఆన్ చేశాడు. ఇస్త్రీ పెట్టె హీట్ అయిందో.. లేదో.. తెలుసుకోవడానికి ఇస్త్రీ పెట్టెను చేతితో తాకాడు. దీంతో ఓబులేసు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. యువకుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వెలుగోడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వాటిని బలోపేతం చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని హోటల్‌-కే ఫర్చ్యూన్‌లో విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన సంఘాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు రుణ బకాయిల రికవరీపై దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలోని 99 సంఘాలకు గానూ ఇప్పటి వరకు కేవలం 46 సంఘాల్లో మాత్రమే రుణాలను రికవరీ చేశారని, ఇంకా 53 శాతం రికవరీ చేయాల్సి ఉందని, రూ.550 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని, సాధ్యమైనంత తొందరగా ఈ బకాయిలను రాబట్టాలని సంఘాల సీఈవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డీసీసీబీ సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు నాగిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సువర్ణావకాశం

రైతులపై రుణ భారాన్ని తగ్గించేందుకు బ్యాంకు చరిత్రలో మొదటి సారిగా దీర్ఘకాలిక రుణాలపై వడ్డీని తగ్గిస్తున్నట్లు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించారు. 11.10శాతం (93పైసలు) నుంచి 10.35 శాతం (86 పైసలు) తగ్గిస్తున్నట్లు తెలిపారు. అలాగే సంఘాల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేసేందుకు ఒక్కో సంఘానికి రూ.25 లక్షల పూచీకత్తును అందిస్తున్నామన్నారు. రుణ రికవరీ సాధిస్తామని హామీ ఇచ్చిన సంఘాలకు రూ.కోటి రుణ అలాట్మెంట్‌ను ఇవ్వనున్నట్లు చైర్మన్ ప్రకటించడంతో సంఘాల అధ్యక్షులు, సీఈవోలు హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- సీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభం





మాట్లాడుతున్న మంత్రి భరత్, సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని మౌర్యఇన్‌లోగల పరిణయ ఫంక్షన్‌హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు' ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ శిక్షణల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావులతో కలిసి మంత్రి టీజీ భరత్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఆర్ మీడియా అకాడమీ చేపట్టిన విలేకరులకు శిక్షణ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు.

వృత్తి నైపుణ్యాలను అందించేందుకు కృషి

జర్నలిస్టుల వృత్తిపరమైన లక్ష్యాలకు ఎన్నో నైపుణ్యాలు అవసరమవుతున్నాయని, వాటిని అందించే దిశగా సీఆర్ అకాడమీ కృషి చేస్తుందని అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అన్నారు. శిక్షణ తరగతుల కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆలపాటి మాట్లాడుతూ మనిషి నిత్య విద్యార్థి అని, ఏ వృత్తిలో ఉన్నా ఆ వృత్తిలో రాణించాలంటే శిక్షణలు అవసరమన్నారు. పాజిటివ్ జర్నలిజాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వంలోని మంచి చెడులతోపాటూ మంచి డెవలప్‌మెంట్‌ను పాజిటివ్ దృక్పథంలో తెలియజేయాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ విలేకర్లు కూడా అందిపుచ్చుకోవాలనే సంకల్పంతో సీఆర్ మీడియా అకాడమీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ శిక్షణల్లో ఉదయం సెషన్‌లో 'ఆంధ్రజ్యోతి' కర్నూలు జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు 'డెస్క్ కో-ఆర్డినేషన్' అనే అంశంపై మాట్లాడారు. మధ్యాహ్నం సెషన్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)' అనే అంశంపై ఏఐ ట్రైనర్, సీనియర్ జర్నలిస్టు విజయ్‌కుమార్ కుర్రా తెలియజేశారు. కార్యక్రమాల్లో సమాచార శాఖ డీడీ జయమ్మ, ఐజేయూ జాతీయ సభ్యుడు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. శ్యాంసుందర్‌లాల్, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, జిల్లా ప్రతినిధులు సుబ్బయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసగౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ గోవిందరెడ్డి



చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డితో వైస్ చైర్‌పర్సన్ అరుణ, సభ్యులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కాలపరిమితి ఈ నెల 15వ తేదీ ముగియనున్న నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకునేందుకు శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. 7వేల మంది సభ్యులు ఉండగా.. 400 మంది సభ్యులు హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారిణి సి.వెంకట నారాయణమ్మ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్‌పర్సన్‌గా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కె.అరుణ, కోశాధికారిగా నరసింహ, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా జి.శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, రఘునాథరెడ్డి, బాబురాజ్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, భీమశంకర్ రెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి, మీనాక్షి ఎన్నికయ్యారు. ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో డీఆర్వో ప్రమాణ స్వీకారం చేయించారు.

'ఎన్నికపై అధికారులకు ఫిర్యాదు చేశా'

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికపై కలెక్టర్, డీఆర్వోకు ఫిర్యాదు చేశానని రెడ్ క్రాస్ సొసైటీ గత మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్న ఐ.విజయకుమార్ రెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. మేనేజింగ్ కమిటీలో 17మంది ఉండగా.. 11 మందిని తనకు అనుకూలమైన సభ్యులను తీసుకుని ప్రశ్నించే సభ్యులను తొలగించారని ఆయన ఆరోపించారు. కర్నూలు జిల్లాలో 7వేల మంది సభ్యులు ఉన్నారని, అయితే వంద మంది సభ్యులతో జిల్లా కమిటీకి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగాయని, ఈ సమావేశానికి 400 మంది సభ్యులు హాజరయ్యారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో పూడూరు వెళ్లే రోడ్డులో తుంగభద్ర నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, డ్రాయర్ మాత్రమే ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9121101063 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీధర్ తెలిపారు.

రైతుకు డ్రోన్ పంపిణీ


డ్రోన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, సెప్టెంబర్13. (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని నాగటూరు గ్రామంలో రైతు గంగన్నకు డ్రోన్‌ను ఎమ్మెల్యే జయ సూర్య రైతుకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న యంత్రాలను, ట్రాక్టర్లను, స్ప్రేయర్లను, టార్పాలిన్లను, రాయితీ ఎరువులు, విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లికార్జునరెడ్డి, నందికొట్కూరు మండల మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ హుశ్శేనయ్య, నరసింహుడు, వంశీమోహన్,రంగారెడ్డి, కనయ్య బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా ఎస్‌ఐగా మల్లికార్జున


ఎస్‌ఐను సన్మానిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): జూపాడుబంగ్లా ఎస్‌ఐగా మల్లికార్జున శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీనారాయణ నంద్యాల జిల్లా జిల్లాట్రైనింగ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు నుంచి మలికార్జున వచ్చారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌పార్టీ మండల నాయకులు ఎస్‌ఐను సన్మానించారు. నాయకులు గాబ్రియేల్, నరసింహులు, యేసన్న, శేఖర్, సోమప్ప, మహబూబ్‌బాషా, శ్రీరాములు, బీబీ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా


పుల్లన్నయాదవ్

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని మండల ప్రధానకార్యదర్శి కడియం పుల్లన్నయాదవ్ అన్నారు. శనివారం ఆయన అధిష్టానం మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నిక చేయడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. 25ఏళ్ల నుంచి పార్టీ కోసం కృషి చేస్తున్నానన్నారు. పదవీకి అవకాశం రావడానికి కృషి చేసిన టీడీపీ నంద్యాల పార్లమెంటు నియోజకవర్గఇన్‌చార్జీ మాండ్రశివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి, ఎమ్మెల్యే జయసూర్య యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 697 కేసుల పరిష్కారం


నందికొట్కూరులో లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శోభారాణి

ఆత్మకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులు, శ్రీశైలం బెంచ్‌కోర్టు నందు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ లో 697 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి తంగమణి, జూనియర్ సివిల్ న్యాయాధికారిరాహుల్ అంబేద్కర్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, శ్రీశైలం పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులతో పాటు బ్యాంకు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్‌తో సహా చిన్నపాటి కేసులు 565, ఎక్సైజ్ కేసులు 48, క్రిమినల్ కేసులు 18, సివిల్ కేసులు 12, భరణం కేసు 1, వరకట్న వేధింపుల కేసు 1, బ్యాంకు కేసులు 52 చొప్పున మొత్తం 697కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. సత్వరమే న్యాయ సేవలు అందించేలా లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నందికొట్కూరు: నందికొట్కూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి తెలిపారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 385 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.8,79,126 నష్టపరిహారాన్ని అందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శరభయ్య, ఏపీపీ సుస్మిత, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల సాయిబాబా నగర్ కుబ్రామసీదులో జమియతుల్ ఉలేమా హింద్ నూతన కార్యవర్గాన్ని కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ముఫ్తి రఫిసాహెబ్, ఉపాధ్యక్షుడిగా అంజద్‌బాషా సిద్దికి, కార్యదర్శిగా జాఫర్‌సాదిక్, జాయింట్ సెక్రటరీ మౌలానా మహబుబ్‌బాషా, గులాం ముస్తఫాలు, కోశాధికారిగా మౌలాలి సాహెబ్, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు నంద్యాల జిల్లా ఇమాంమ్‌ల సంఘం అధ్యక్షులు అంజద్ బాషాసిద్దిఖీ తెలిపారు. కార్యక్రమంలో ఇమాములు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాతృభూమికి కళార్చన పోటీల్లో భాగంగా శనివారం జూనియర్ విభాగంలో డాక్టర్ రవిక్రిష్ణ క్విజ్‌మాస్టర్‌గా , కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీకాంత్, రవిప్రకాష్‌ల నిర్వహణలో క్విజ్ పోటీలను నిర్వహించారు. నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీలలో 7 పాఠశాలల నుంచి ఐదుమందితో కూడిన జట్లు పోటీపడ్డాయి. దేశ స్వాతంత్ర ఉద్యమ చరిత్ర, గాంధీజీ జీవితం, క్రీడలు, సాంస్కృతిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలపై 8 రౌండ్లలో రెండు గంటలపాటు సాగిన క్విజ్ పోటీలో విద్యార్థులు అబ్బురపరిచేలా సమాధానాలు చెప్పి ప్రతిభను చాటుకున్నారు.

● సబ్‌జూనియర్ కేటగిరిలో మూడోతరగతి లోపు బాల బాలికలు తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల్లో కథ చెప్పే పోటీలో వందమంది బాలల చక్కటి హావాభావాలతో ఆకట్టుకునేలా కథలు వినిపించారు. జూనియర్ క్విజ్ పోటీలలో ప్రథమస్థానంలో గురురాజా స్కూల్ విద్యార్థులు నిలిచారు. అనంతరం స్పాట్ వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతలుగా అవ్వారి శేషఫణి, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మహబుబ్ బాషా, రబ్బాని, హుస్సేన్‌మియాలు వ్యవహరించారు.



ఏళ్లవుతోంది..

పట్టించుకోండి!

● తెదేపా ప్రారంభించింది.. వైసీపీ వదిలేసింది.. కూటమి పూర్తి చేస్తుందా?
● ప్రమాదకరంగా బ్రిడిపై ప్రయాణం
● ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని నూతన బ్రిడ్జి

నంద్యాల పట్టణంలోని రాణి-మహారాణి థియేటర్ల సమీపంలోని బ్రిడ్జికి మోక్షం కలగడం లేదు. బ్రిడ్జి పనులు మొదలై దాదాపు 10 ఏళ్లు అవుతోంది. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో నిత్యం ప్రజలు బ్రిడ్జిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అడుగడుగునా గుంతలు పడడంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొన్ని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం 2016లో స్పందించి రూ.7.33కోట్లు మంజూరు చేసింది. మొదట కేసీవీఆర్ఎస్ కంపెనీ 2017లో పనులు ప్రారంభించగా 2019వరకు పనులు చేసి వదిలేశారు. తర్వాత ప్రభుత్వం మారగా వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. ప్రస్తుతం జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఏడాది దాటినా బ్రిడ్జి గుంచి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్‌నగర్, నందమూరినగర్, టిడ్కో భవనాలతో పాటు పులిమద్ది, రాయమాల్పురం, మునగాల, పోలూరుతోపాటు గడివేములవరకు మరో పదిగ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై ప్రయాణం చేస్తారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈదారిలో కుందూ బ్రిడ్జిపై ఎదురెదురుగా వాహనాలు వస్తే బ్రిడ్జి దాటాలంటే హడలెత్తిపోతున్నారు. ఎక్కడ కింద పడిపోతామోనని భయంతో ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

2016లోనే నిధులు మంజూరు..

అప్పటి టీడీపీ ప్రభుత్వం 2016లో బ్రిడ్జినిర్మాణం నిధులు విడుదల చేసింది. అయితే రూ. కోటి 40లక్షల పనులు మాత్రమే చేసి కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ఆ తర్వాత 2020లో అలైన్‌మెంట్ మార్చి రూ.18కోట్లకు ఆర్డీవో ఎస్టిమేషన్ వేశారు. ఇందుకుగాను 0.75సెంట్లు ప్రైవేట్ భూమి, 0.10సెంట్లు ప్రభుత్వ భూమిని అలైన్‌మెంట్‌లో చేర్చారు. 2021లో తిరిగి పనులు ప్రారంభించారు. రెండేళ్ల పాటు ఎస్వీకన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులు చేపట్టింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడంతో పను లు నత్తనడకన సాగాయి. టీడీపీ ప్రారంభించిన బ్రిడ్జి కాబట్టి వైసీపీ ప్రభుత్వంతో పనులు చేయకపోవడంతో గతంలో నారా లోకేశ్ నంద్యాల పర్యటనలో భాగంగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ బ్రిడ్జి వద్ద సెల్ఫీ ఫొటోలు దిగారు. బ్రిడ్జి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో 2వ కాంట్రాక్టర్ కూడా బిల్లులు రాక చేతులెత్తేశాడు. అంతేకాకుండా ల్యాండ్ అక్విజిషన్‌లో భాగంగా రైతులకు చెల్లించాల్సిన పరిహారం కూడా ఇవ్వకపోవడంతో రైతులు పొలం ఇచ్చేందుకు విముఖత చూపారు. దీంతో మొదట నిధుల్లేక, తర్వాత రైతులు పొలాలివ్వక టీడీపీ ప్రారంభించిన బ్రిడ్జినిర్మాణానికి వైసీపీ ప్రభు త్వం పట్టించుకోలేదనేందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నప్పటికీ బ్రిడ్జి నిర్మాణం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే నంద్యాల పట్టణానికి ప లు గ్రామాలనుంచి, వైఎస్‌నగర్, నందమూరినగర్, టిడ్కోభవనాలకు రహదారి సౌక ర్యం ఉంటుంది.

నిధుల కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావాలంటే ముందుగా కాంట్రాక్టర్‌కు దాదాపు రూ.9కోట్లు, రైతులకు రూ.4కోట్లు, పైప్‌లైన్‌కు రూ.40లక్షలు, విద్యుత్ పనులకు రూ.60లక్షలు అవసరం ఉంది. దాదాపు రూ.15కోట్ల నిధు లు కేటాయిస్తే కాని బ్రిడ్జి నిర్మాణం పూర్తిఅయ్యే పరిస్థితి కనబడటంలేదు. మం త్రులు స్పందించి బ్రిడ్జినిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మధ్యలో నిలిచిపోయిన బ్రిడ్జి


దెబ్బతిన్న బ్రిడ్జిపైనే వాహనాల రాకపోకలు

బిల్లులు లేవు..



ప్రభుత్వం నుంచి బిల్లులు రాక బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు రూ.8.5 కోట్లు, భూమి యజమానులకు రూ.3.25 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వానికి నాలుగు నెలల క్రితం బకాయి బిల్లులు అప్‌లోడ్ చేశాం. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. బిల్లులు కొంత నైనా వస్తే కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

● శివకుమార్, ఎస్ఈ ఎస్సార్బీసీ

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మోమిన్ షబానా

ఆత్మకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటికలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబానా పేర్కొన్నారు. శనివారం ముస్లిం శ్మశాన వాటికను ఆమె సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన జేజినాయన మోమిన్ హుసేన్ సాహేబ్, తన తండ్రి మోమిన్ జిలానీ పెద్దమనస్సుతో ముస్లిం శ్మశాన వాటికకు స్థలాన్ని విరాళంగా అందజేసినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం ఈ శ్మశాన వాటికలో వర్షపు నీరు నిలిచి అంత్యక్రియలు జరిపేందుకు ఇబ్బందిగా మారినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈమె వెంట అంజుమన్ కమిటీ కార్యదర్శి రఫీక్, స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పీల్ మున్నా, కార్పెంటర్ మున్నా, మహ్మద్, సాధిక్, షఫి తదితరులు ఉన్నారు.

ఆలయానికి బీటీ రోడ్డు నిర్మాణం


రోడ్డు వేస్తున్న దృశ్యం

పాణ్యం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని ఎస్సార్బీసీ కాలనీలోని వేంకటేశ్వర ఆలయానికి శనివారం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి వినతి మేరకు ఎమ్మెల్యే గౌరు చరిత రహదారిని వేయించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి రోడ్డు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడేవారు. ఈ రోడ్డుతో యేటా నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ హైవే రహదారి నిర్వాహకులు బాలకృష్ణ, కొనిదేడు శంకరయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీలకు నంద్యాల క్రీడాకారిణి



నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో హల్ద్వానిలో జరిగిన అండర్-17 జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచి చిన్మయశ్రేయ భారతజట్టుకు ఎంపికైనట్లు ఫెన్సింగ్ శిక్షకుడు లక్ష్మణ్ తెలిపారు. చిన్మయశ్రేయ గత నెల 29, 30తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానిలో ప్రతిభచూపి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. త్వరలో హల్ద్వానిలో జరిగే ఆసియా ఫెన్సింగ్ పోటీల్లో భారతజట్టు తరపున పాల్గొంటుందన్నారు. ప్రస్తుతం చిన్మయశ్రేయ ఢిల్లీలో శిక్షణ శిబిరంలో పాల్గొంటోందన్నారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన చిన్మయశ్రేయను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కమతం శంకర్

ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, జిల్లా సహాధ్యక్షుడు ఎంఎస్ ఉమర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అయితే అధికారంలోకి వచ్చి 15నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. దసర పండుగ సందర్భంగా ఏడీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు విధుభూషణ్, సుబ్రమణ్యం, రామాంజనేయులు, దాసు, వెంకటేశ్వర్లు, ఆరీఫ్ బాషా, భాస్కర్, అంబయ్య తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీశైలం, సెప్టెంబరు 13, (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన వితరణ పథకంనకు ప్రకాశం జిల్లా దర్శి వాస్తవ్యులు డి.లక్ష్మీప్రసన్నరెడ్డి అనుదాత దేవస్థానానికి విరాళంగా రూ.1,00,116 పర్యవేక్షకులు కె.అయ్యన్న కు అందజేశారు.దాతకు రశీదు,ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి


రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహానంది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఉండే గిరిజన విద్యార్థులు సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. శనివారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమపాఠశాల లోని విద్యార్థులకు తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంపీహెచ్ ఆధ్వర్యంలో సిబ్బంది చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అమీనాబీ, పర్యవేక్షకుడు నరసింహరావు, ప్రధానోపాధ్యాయుడు సత్యాలు, హెల్త్ అసిస్టెంట్ రహిమాన్, మహాలక్ష్మి, సునీత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వ్యాధులు.. ముట్టడి





● ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
● నంద్యాల జీజీహెచ్‌లో రోగులకు బెడ్లు కరువు
● ఒకే మంచంపై ఇద్దరు పడుకోవాలని నర్సు హుకుం
● సెలవులో ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రస్తుతం వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ముట్టడించాయి. ప్రతి ఇంట్లో ఒకరు ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో సరైన డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్యన, రోడ్లపైనే నిల్వ ఉంటుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన వైద్యాధికారులు గ్రామాలపై కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. పారిశుధ్యం కూడా ఎక్కడి పడితే అక్కడ ఉన్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పీహెచ్‌సీ, నంద్యాలలోని జిల్లా ఆసుపత్రులో సరైన వైద్యం అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. భారీ వర్షాలతో గ్రామాల్లో ఇళ్లచుట్టూ మురుగునీరుండటం, పట్టణాల్లో కూడా ఖాళీస్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. మున్సిపాల్టీ పరిధిలో కూడా సరైన పారిశుధ్య చర్యలు తీసుకోకపోవడంతో దోమలతో ప్రజలు విలవిలలాడుతున్నరు. రోగుల తాకిడికి ఎక్కువవడంతో నంద్యాల జీజీహెచ్‌లో మంచాలులేక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులు పడుకోవాలని నర్సులు చెబుతున్నారు. వైద్యులు అలాగే చెప్పమని సూచిస్తున్నట్లు నర్సు చెప్పడం గమనార్హం. ఆస్పత్రిలో కొన్ని వార్డుల్లో మంచాలు ఖాళీగా ఉన్నా పర్యవేక్షణ లోపంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉండటంతో రోగులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా కేంద్రంలో ఎప్పటికప్పుడు జీజీహెచ్‌లో వార్డుల్లో పర్యటించి బెడ్లను అందుబాటులో ఉంచాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉండడంతో పరిస్థితి దయనీయంగా మారింది. రోగులు, రోగుల బంధువులతో ఆస్పత్రి వార్డులు కిటకిటలాడుతున్నాయి. నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాలనుంచి రోగులు అధికంగా జీజీహెచ్‌కు చికిత్స కోసం వస్తున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి రోగులకు అవసరమైన బెడ్లను అందుబాటులో ఉంచాలని రోగుల బంధువులు కోరుతున్నారు.


ఆస్పత్రిలో బెడ్డు లేక వరండాలో పడుకున్న రోగి


జీజీహెచ్‌లో ఒకే బెడ్డుపై ఇద్దరు పేషెంట్లు


ఓపీ వద్ద రోగుల బంధువులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

తపాలా సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బహుమతులు అందిస్తున్న అప్పలస్వామి

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి సూచించారు. శనివారం స్థానిక తపాలా కార్యాలయంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాంనాథ్ ఆధ్వర్యంలో తపాలా అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆన్‌లైన్ పోస్టల్ అకౌంట్ ప్రజలకు ఎలా ఉపయోగ పడుతుందో తెలియజేయాలన్నారు. గత ఏడాది ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. సమావేశంలో సీనియర్ అకౌంట్ మేనేజర్ శ్రీనివాసులు, అధికారులు మహినూర్, సునీతా, గీత, చైతన్య, సురేష్ బాబు, నరసింహరావు, లింగమూర్తి, నాగేంద్ర పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి



మాట్లాడుతున్న మల్లు రఘునాథ్‌రెడ్డి

చాగలమర్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మస్తాన్‌బాష అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. అలాగే పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాష, కార్యదర్శి ఉస్మాన్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహులు గురు చంద్రుడు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న లక్ష్మయ్య, మహబూబ్‌బాష, హబిమున్నిసాలను శనివారం ఎస్టీయూ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

- 25ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర పబ్లిక్ పాఠశాలలో శనివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. పాఠశాలలో 2000-01 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఒక చోట చేరి సందడి చేశారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఎర్రం పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాలతి, ఉపాధ్యాయులు వసంత, లక్ష్మి, మహేశ్వర్‌రెడ్డి, మునీర్‌బాష, నరసింహారెడ్డి, లక్ష్మీపతి, వెంకటేశ్వర్లు, జనార్దన్, భాస్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం సౌజన్య, డాక్టర్ తనుజా, రజనీ, జాకీర్ హుసెన్, హరికృష్ణ, నరసింహాచక్రవర్తి, ఆదినారాయణ, మహబుబ్ పీరా, సురేష్ రఘుకార్తీక్ పాల్గొన్నారు.

హిందూ సాంప్రదాయాన్ని కాపాడారు: డీఎస్పీ



గణేశ్ ఉత్సవ మండల కమిటీ సభ్యులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బేతంచెర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల గణేశ్ ఉత్సవ మండలి సభ్యులు హిందూ సాంప్రదాయాన్ని కాపాడారని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని షాదీఖానాలో సీఐ వెంకటేశ్వరరావు అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో హిందూ సాంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవ కమిటీలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణేశ్ కేంద్ర కమిటీ సభ్యులు గౌరి హుశేన్ రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, మత పెద్దలు, సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, వెంకట్రామిరెడ్డి, ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐ రమేష్‌బాబు, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ నాయకులు ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, చంద్రశేఖర్, మండల ఖాజీ నూర్ అహ్మద్, ఖాజా హుశేన్, నిర్వాహకులు పాలొన్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

బేతంచెర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన బేతంచెర్ల-నంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని దుర్గాపేటకు చెందిన అజయ్, బుగ్గానపల్లె తండాకు చెందిన మోహన్ నాయక్ తమ బైక్‌పై బేతంచెర్లకు వస్తుండగా.. అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కంబగిరి స్వామికి పూజలు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన కంబగిరి స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కమలేశ్వర శర్మ స్వామి వారికి అభిషేకం చేసి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

గోడలు తెచ్చిన గొడవ





రోడ్డుపై అడ్డంగా వదిలిన నాపరాళ్లపై అవస్థ పడుతూ దాటుతున్న మహిళలు

- నడిచేందుకు దారి లేక ప్రజలు ఇక్కట్లు
- రెండు కుటుంబాల పోరు.. ప్రజలు బేజారు
- పట్టించుకోని అధికారులు

అవుకు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు ఎవరికి వారు ఎదురెదురుగా నిర్మించిన గోడలు గొడవలకు దారి తీస్తున్నాయి. దీంతో రహదారి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. చూసినన్ని రోజులు ప్రజలు చూశారు.. వారిలో ఆవేశం కట్టలు తెచ్చుకున్నది. ఒక్కసారిగా ట్రాక్టర్లతో నాపరాళ్లు తెచ్చి అసలు నడిచేందుకు వీలు లేకుండా ఆ రెండిళ్ల మధ్య వేశారు. ఈ ఘటన ఎక్కడో మారుమూల గ్రామంలో జరిగింది అనుకుంటే పొరపాటే. ఇది అవుకు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని కుమ్మరిదిడ్డి వీధిలోనిది. వివరాలు.. ఆవీధికి వెళ్లే రహదారిలో ఓ కుటుంబం తమకు హక్కు ఉందని ఇంటి నిర్మించింది. ఆఇంటికి ఎదురుగా ఉన్న మరో కుటుంబం మాకు హక్కు ఉన్నట్లు చెబుతూ ఇంటి ముందు గోడను నిర్మించారు. ఆరు నెలలుగా సమస్య నానుతూ వస్తుంది. వీధిలోని అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రజలు అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం కాలేదు.

వారం రోజుల క్రితం

గోడలతో విసుగుచెందిన ఆకాలనీ వాసులు వారం రోజుల క్రితం ట్రాక్టర్లతో నాపరాళ్లను తెచ్చి వీధిలోని నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుకు అడ్డంగా వదిలారు. వీధుల్లోకి వెళ్లేందుకు దారిలేక వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం కాలనీలోని మహిళలు పెద్దఎత్తున పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రహదారి సమస్య జఠిలంగా మారటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో నాలుగు దారులు కలిసే ఈవీధిలోని రహదారి సర్కిల్ సువిశాలంగా ఉండేది. ఎవరికి వారు తమకు హక్కు ఉందని రోడ్డును ఆక్రమించుకుంటూ కట్టడాలు నిర్మించుకున్నారు. ఈ మధ్య కాలంలో ఆవీధుల్లోని రహదారి చాలామటుకు ఆక్రమణకు గురి కావటంతో ఇరువైపుల మూసుకుపోయింది. వీధిలోని ఆక్రమణలను అధికారులు తొలగించి రహదారి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం

వీధిలో కొందరు రోడ్డును ఆక్రమించి ఇంటికి కాంపౌండు, గోడలు, మెట్లు, అరుగులు నిర్మించుకున్నారు. వీధిలోని రోడ్డును ఆక్రమించుకున్న ఇళ్ల యజమానులకు నోటీసులిచ్చాం. మూడు రోజుల్లో రెవెన్యూ, పోలీస్ అధికారుల సహయంతో అక్రమ కట్టడాలను తొలగిస్తాం.

● హరిప్రసాద్, ఈవో, అవుకు

తుఫాన్ దెబ్బతో రైతన్న విలవిల

- తడిచిన మొక్కజొన్న ధాన్యం
- దెబ్బతిన్న పంట పొలాలు
- ఆందోళనలో రైతులు

చాగలమర్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దెబ్బతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతన్న విలవిలలాడుతున్నారు. మండలంలో మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కుండపోత వర్షం కురిసింది. దాంతో ముత్యాలపాడు, శెట్టివీడు, పెద్దబోదనం, చిన్నబోదనం, రాంపల్లె, నేలంపాడు, మద్దూరు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మినుము, కంది తదితర పంటలు నీట మునిగి దెబ్బతింటున్నాయి. మొక్కజొన్న పంటలో నీరు నిల్వ ఉండటంతో నేలవాలి మొక్కలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముత్యాలపాడు, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లో కోత కోసిన మొక్కజొన్న ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టుకున్నారు. వర్షం దెబ్బతో తడిచింది. అసలే ధర లేక అల్లాడుతున్న రైతులకు వీడని వర్షంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పాలేరు వాగు వద్ద పోలీసుల బందోబస్తు



శెట్టివీడు రహదారిలో తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌కు ఎత్తుతున్న రైతులు

తగ్గని వరద ఉధృతి

మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుందూ, వక్కిలేరు పొంగి ప్రవహిస్తున్నాయి. శనివారం కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వంతెనలపై వరద నీరు ప్రవహించింది. ఆ నీటిలోనే విద్యార్థులు, కూలీలు, రైతులు, వాహనదారులు రాకపోకలు సాగించారు. పాలకులు, అధికారులు స్పందించి వేసవిలోనైనా హైలెవెల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతించని పాలేరు వాగు

సంజామల: ఉగ్రరూపం దాల్చిన పాలేరు వాగు శనివారం నాటికి ఉధృతి తగ్గలేదు. వాగు శాంతించకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కోవెలకుంట్ల నుంచి అవుకు మీదుగా తాడిపత్రి, అనంతపురం వెళ్లే వాహనాలు కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. వాహనాలు రాకపోకలు జరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాగు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ రమణయ్య, ఏఎస్ఐ రామకృష్ణా రెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షేమమే కూటమి లక్ష్యం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- రూ.1.93 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ



ముత్యాలపాడులో ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో రూ.1.93 కోట్లతో వైద్యశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకముందు ఎమ్మెల్యే గ్రామానికి చేరుకోగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిలిచిన పనులను నేడు వేగవంతం చేస్తున్నామని అన్నారు. ఆళ్లగడ్డలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం గత ప్రభుత్వంలో నత్తనడకన సాగిందని, నేడు వందశాతం పూర్తి చేస్తున్నామని అన్నారు. యూరియా పట్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. చాగలమర్రిలో రూ.60 లక్షలతో పీహెచ్‌యూ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఎమ్మార్సీ భవన నిర్మాణానికి రూ.53 లక్షలు నిధులు కేటాయించారని, ఆ నిధులతో పను లు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, వైద్యులు సుల్తాన, ఏఈ రమణయ్య, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పాలడైరీ చైర్మన్ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

రుద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18వేల నల్లజాతి పశువులు, 2200 తెల్ల జాతి పశువులు ఉన్నాయన్నారు. పాడిపశువులు, ఎద్దులు ఆవులు ఉన్న ప్రతి యజమాని పశువైద్యశాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

భగవద్గీత పారాయణం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబాజీ పిరమిడ్ ధ్యానమందిరం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయ ణం, ప్రాముఖ్యతను వివరించారు. శనివారం ఉదయం శ్రీనివాస హైస్కూలులో నెరవాడ గ్రామస్థులు గీతా రామసుబ్బారెడ్డి పట్టణానికి చేరుకుని భగవద్గీతలోని సాంఖ్యయోగ సారాంశాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సమస్య తీరింది.. పారిశుధ్యం మెరుగు పడింది



ప్రధాన వీధులో నిలిచిన మురుగు (ఫైల్)



మురుగు తొలగించి గ్రావెల్ వేసిన ప్రధాన వీధి

డోన్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోసానిపల్లె గ్రామ ప్రధాన వీధిలో నెలకొన్న పారిశుధ్య సమస్య పరిష్కారమైంది. సుదీర్ఘకాలికంగా మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ ఉండేది. విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. గోసానిపల్లె గ్రామ ప్రధాన వీధిలో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించారు. మండల నిధులు దాదాపు రూ. రెండున్నర లక్షల వెచ్చించి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో గ్రావెల్ మట్టిని వేయించి కాంక్రిట్ ద్వారా పటిష్ట పరిచారు. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రుణపడి ఉంటాను



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న నూర్‌బాషా సంఘం రాష్ట్ర డైరెక్టర్ కాశీంసాహెబ్, తదితరులు

బనగానపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఏపీ దూదేకుల సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ కాశింబాబు అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు యాగంటిపల్లె దస్తగిరి, భానుముక్కల సొసైటీ డైరెక్టర్ దస్తగిరి, తిక్కన్న, ఆయిల్ కాశీం, దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వామిత్వ ఫేజ్-2 కింద ఏడు గ్రామాలు ఎంపిక

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ ఫేజ్-2 కింద ఏడు గ్రామాలు ఎంపికైనట్లు డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అమడాల, భీమునిపాడు, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, వెలగటూరు, సౌదరదిన్నె, కోవెలకుంట్లలోని చింతకుంట రెవెన్యూ గ్రామాలు ఎంపికైనట్లు వివరించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏమైనా సందేహాలుంటే ఆయా గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని కలిసి తెలుసుకోవాలన్నారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు

చాగలమర్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీబజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామి, శెట్టివీడు, మూడురాళ్లపల్లె రహదారిలోగల అభయాంజనేయస్వాములకు శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, ఆంజనేయస్వామి వ్రతాన్ని నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో వీఆర్‌ఏ ఆనంద్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

డ్రైవర్లకు లైసెన్స్ ఉండాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే డ్రైవర్లకు తప్పకుండా లైసెన్స్ ఉండాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ముదిగేడు వెళ్లు రోడ్డులో వాహనాల తనిఖీ చేశారు. లైసెన్సులు, సర్టిఫికెట్లు లేని వాహనాలకు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేవీ సుబ్బారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కేవీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ ఓబన్న, బాలక్రిష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు

రుద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. అండర్ -17 విభాగంలో రాఘవేంద్ర, అలేఖ్య, లక్ష్మీకళ్యాణి, అండర్- 19 విభాగంలో సుప్రజ, ఆశ్చర్య జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ సోముల రమణారెడ్డి అకాడమి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆర్‌ఆర్ అకాడమీ కోచ్ సుబ్బారాయుడు శనివారం తెలిపారు. క్రీడాకారులు విష్ణుతేజ, మేఘన, వర్షిని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులను, కోచ్ సుబ్బారాయుడును ఎన్‌వీఎన్ హరిప్రసాద్‌రెడ్డి, మద్రెడ్డి శ్రీనివాసరెడ్డి, వైద్యులు సుజాతరెడ్డి అభినందించారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న బీసీ ఇందిరమ్మ

అవుకు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని మదర్ మోడల్ హైస్కూల్‌లో నిర్వ హించిన ఇంటర్ జోన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ - 2025 పోటీలు హోరాహోరీ గా సాగినట్లు కర స్పాండెంట్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఎం.శ్రీనివాసులు శనివారం తెలిపారు. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలకు ముందు విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మ హబూబ్ బాషా, డీఎస్‌డీవో ఎంవీఎన్ రాజు, సెక్రటరీ ఫయాజ్‌బాషా, లీగల్ అడ్వైజర్ అల్లీహుశేన్, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఏపీ రెడ్డి, నాగరాజు, బాక్సింగ్ కోచ్ కేశవ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై చెత్తను వేయరాదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట నివాసం ఉంటున్న ప్రజలు చెత్తను రహదారిలో వేయరాదని డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌలిగౌడు సూచించారు. శనివారం గ్రామ సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో పట్టణంలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

త్వరగా పూర్తి చేసుకోవాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంట నమోదును త్వరగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదుతోనే రైతులకు పంట విక్రయాలకు అవకాశం ఉంటుందని ఏవో సూచించారు.

కుంటను తలపిస్తున్న రహదారి

ప్యాపిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటరెడ్డి కాలనీకి వెళ్లే రహదారి కుంటలా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారిలో నీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా పరిస్థితి ఇలాగే ఉన్న ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంకటరెడ్డి కాలనీరహదారిలో నిలిచిన వర్షపు నీరు

టీడీపీ మండల కన్వీనరుగా రంగనాయకులు



రంగనాయకులు



వెంకటకృష్ణారెడ్డి

రుద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల కన్వీనరుగా ఎల్‌వీ రంగనాయకులు , జనరల్ సెక్రటరీగా భూమిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి నియమితులైయ్యారు. శనివారం ఉత్తర్వులు జారీ అయినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అలాగే మండల ఉపాధ్యక్షుడిగా మీసాల లక్ష్మీనరసయ్య (చిన్నిక్రిష్ణ), ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.సంజీవరాయుడు, మాలపాటి నాగేశ్వర్‌రెడ్డి, ఎం చంద్రశేఖర్, కార్యదర్శులుగా చంద్రుడు, జంగా వెంకటేశ్వర్‌రెడ్డి, రామనాథరెడ్డి, కోశాధికారిగా రజాక్‌లను నియమించారు. నూతన మండల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.